


# దెబ్బకి దెబ్బ ★

రచన:
శ్రీమతి పరానేని శ్రీశైల భ్రమరాంబ

ఎండ నడి నెత్తిమీద చుర్రుమంటూంటే, ప్రచండ మార్తాండుడు నిప్పులు కురిపిస్తూ చెట్లనీ పిట్టల్నీ కూడా మాడ్చి వేయించేస్తోంటే నెత్తికి గొడుగైనా లేక, చిరిగి అతుకులు వేసిన పంచతో, నెలకోసారైనా దోభీ ముఖమెరుగని నీలం షర్టుతో, నవమాసాల నుంచీ నీకాళ్ళ క్రింద నలిగా ఇంక నిన్ను సగమైనా అనుకొని వుండలేనని స్వస్తి చెప్పే చవకబారు చెప్పుల జోడుతో సరిగ్గా పన్నెండు గంటలకి థర్డ్‌గ్రేడ్ గుమస్తా సుబ్బారావు చెమటతో తడిసిన శరీరాన్ని ఇంటికి జేరేశాడు.

అప్పటికి ఇంట్లో అతి నిశ్శబ్దంగా ఎవరికి వారే కొట్టేసిన పాముల్లా పడుకొన్నారు పిల్లలు. ఓ ఉత్తరాన్ని చేత్తో పట్టుకు కళ్ళంట నీళ్లు కారుస్తూ వంటింట్లో గడప మీద తల పెట్టుకు పడుకొంది ఇల్లాలు. సుబ్బారావు ఇంటినీ, ఇల్లాలినీ పరీక్షగా చూస్తూ నిల్చున్నాడు. విచారభారంతో చెక్కిళ్ళమీద నుంచి తీగల్లా కన్నీరు ధారగా కార్తోంది ఆమెకి. ఆవిడకి బాహ్యస్మృతి లేనట్లు తను వచ్చినా పల్కరించక పోవడమే తెలుస్తోంది.

"సుందరం ఎక్కడనుంచి ఆ ఉత్తరం?" అనడిగాడు ఆత్రుతగా.

"ఇదిగో" అంటూ అతని చేతికిచ్చి పెల్లుబికిన దుఃఖాన్ని దిగమ్రింగుకొంటూ కవరుమీది అడ్రసు చూస్తోంది లోని కాగితం భర్తకిచ్చి.

మహారాజశ్రీ మావియ్యంకుడు సుబ్బరావు గారికి;

మీరిస్తానన్న కట్నం సొమ్ము పట్టుకు నేటివరకూ రాలేదు. మీరే మా గౌరవ మర్యాదలు గుర్తించుకొని తెస్తారని ఊరుకున్నామే కాని ఇంత కుటిలాలోచనతో వున్నారని నేటివరకూ తలంచలేదు. ఈ ఉత్తరమందిన వారంరోజుల్లో సదరు మా అబ్బాయికి రావల్సిన కట్నం ఇతర లాంఛనాలతో సహా మీరు రావలెను. ఆ విధంగా మీరు సొమ్మివ్వకుండా కాలయాపన చేస్తూ ఉత్తరం వ్రాసిన మా అబ్బాయికి మళ్లీ వివాహం నిశ్చయింపదల్చుకొన్నామని, మీ అమ్మాయిని మీ ఇంటికి తీసుకొచ్చి దిగబెట్టగలవారమని ఇందుమూలముగా మీకు తెలియజేస్తున్నాము.

ఇట్లు
కనకరాజు.

ఈ ఉత్తరం చదివేసరికి అతనికి తన నీడ తననే వెన్నులో పొడిచినట్లయి నిల్చున్నవాడు కుప్పలా కూలబడిపోయాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ సుబ్బరావు

సుందరమ్మ లేచి చెంబునీళ్లు తెచ్చి "లేవండి కాళ్ళు కడుక్కొని భోజనం చేసాక తాపీగా ఆలోచించొచ్చు. ఇప్పటికే ఒంటిగంట కావస్తూంది." అంటూ ఆదరంగా పిల్చింది.

"ఒక్క పూట తిండి తినకపోతే మన మేం చచ్చిపోం మన శర్వాణి గతేం కావాలి?" అంటూ ఎంతో బాధగా అన్నాడు.

"ముందు భోజనం చెయ్యండి. కడుపులో కాస్త చల్లబడ్డాక ఆలోచించుకోవచ్చు" అని తొందరచెయ్యడంతో విధిలేక అన్నంముందు కూర్చున్నాడు అంతలో ఇంటి యజమాని సుబ్బారావు గారూ! అంటూ లోపలికి వచ్చి 'ఏమండీ! మూడు నెలల అద్దె ఇదివరకే ఇవ్వాలి. ఇవ్వాళ పదోతారీకు. ఈవారంలో మా అద్దె మాకు పూర్తిగా ఇవ్వకపోతే తగిన చర్య తీసుకోవాల్సి వస్తుంది' అంటూ సింహగర్జన చేసేసరికి నోట్లో పెట్టుకొన్న ముద్ద కూడా మింగలేక పోయేడు. అంతలోనే ఎదురింట్లో వున్న టీచరుగారు వీధులో కేకేసి లోపలికి వచ్చి "ఏమండీ! ఇరుగు పొరుగు అని మంచికోసం ఇచ్చినందుకు బాగానే వుంది రెండు నెలలై పుచ్చుకొన్న ఇరవై రూపాయలు ఇంకా ఎప్పుడండీ ఇవ్వడం? నేనూ మీవంటివాణ్ణే కదా!... అనేసి అతనూ వెళ్లిపోయాడు. ఇంక అన్నంముందు నుంచి లేచి వెళ్లి చెయ్యి కడుక్కున్నాడు సుబ్బారావు.

ఒక్కసారిగా పిల్లలవైపు చూచాడు. వంటినిండా సరియైన బట్టలులేక, తలకు నూనెలేక ఒంటిపూట అర్ధాకలి తిండితో పెరుగుతున్నారు తన నిర్భాగ్యపు సంతతి. కూతురు పెళ్లికోసం చేసిన అప్పులు ఇప్పటివరకూ తనకి తీరక ముప్పుతిప్పలూ పడుతున్నాడు ఈ తల మునిగే అప్పులతోనే వేగలేక పోతోంటే; మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు వియ్యంకుని ఉత్తరం...... ఒక్కసారిగా కుక్కి మంచం మీద కూలబడ్డాడు సుబ్బారావు తన కూతురు అత్తవారింట్లో వుండే వ్యక్తులు అర్గురూ అమృతాంజనం బొమ్మల్లా తన ఊహా జగత్తులో తిరుగుతోంటే తన మనస్సు గూడు తప్పిన పక్షిలా కూతురు వైపుకు మళ్లింది.

సంవత్సరం క్రిందట తను కూతురికి అసలు పెళ్లి చేద్దామనుకోలేదు. కాని అరాతుగా ఓరోజున తన బావమరిది కాబోయే అల్లుణ్ణి వెంటబెట్టుకు రావడం; తన కూతురి శర్వాణిని చూడడం, ఒక్క పూటలో వెళ్లిపోదామనుకొన్న తన బావమరిది రెండు రోజులు ఆగడం, అటుపైన ఇద్దరూ కల్సి వెళ్లిపోయాక తన బావమరిదే తనకు నిష్ఠూరంగా ఉత్తరం వ్రాయడం, అంతా గుర్తుకొచ్చింది—అసలు కారణం కనుక్కొందామని బయల్దేరబోతోంటే, తన బావమరిదితో వచ్చిన అతడే గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు. ఇంక అతన్నే సవిస్తరంగా ముఖాముఖిని అడిగేద్దామనుకొని లోపలి కాహ్వానించాడు తను.

"ఏమండీ? మీరు మొదట మా బావమరిదిగా రమ్మాయిని చేసుకుంటానని ఇప్పుడు మళ్ళీ వద్దన్నారుట. అందుకునే నేదో చెప్పిపెట్టానని నా మీద మండిపడ్తూ వ్రాశాడు......" అంటూ సుబ్బారావే ఉపక్రమించాడు సంభాషణ.

"అవును. ఆ పిల్ల నాకు నచ్చలేదు. అదీకాక కట్నం పుచ్చుకొనే సంబంధం నాకు సుతరామూ......"

"అయితేమాత్రం? మీకోసం ఇంత సొమ్ము ఖర్చుపెట్టిన తర్వాత మీ తల్లితండ్రులు రాబట్టుకొనే అవకాశం వున్నప్పుడు ఒదులుకొంటారా?"

"అల్లాగయితే వాళ్లకి నిశ్చయంగా అదే అభిప్రాయం వుంటే నేనే సంపాదించి ఇస్తానే కాని ఒకరిదగ్గర పీడించి రాబట్టుకోడానికి మాత్రం సహించలేనండి."

"అయితే మీరు బీదవాళ్ల పిల్లల్ని చేసుకోడానికి......"

"వివాహానికి బీద, సాదా అనే భేదం కాదండీ నా దృష్టిలో ప్రధానం. వివాహం వ్యక్తిగత విషయం. స్త్రీ పురుషులు ఒకర్నొకరు బాగా అర్థం చేసుకోగల స్వతంత్ర భావాలు వారిలో వుండాలి... పెళ్లి చేసుకొనే ముందే కొన్ని విషయాలు ఆ స్త్రీపురుషు లిద్దరూ ముఖస్థంగా మాట్లాడుకొనే అవకాశం ఇవ్వాలి అంతే కాని పాత పద్ధతులు నాకు నచ్చవు. కొన్నికొన్ని చోట్ల పెద్దవాళ్లు వధూవరుల మంచి చెడ్డలు నిర్ణయించి చేస్తే; ఆ భార్యాభర్తల అభిప్రాయాలు వాళ్ల జాతకాల్లో మాత్రమే కలుస్తాయి. నిత్యజీవితంలో మాత్రం ఆ దంపతులకి తూర్పు పడమరలకి వున్నంత తేడా. ఒకరు చేద్దాం అంటే ఇంకొకరు వద్దు. ఇదే పద్ధతిలో నడుస్తుంది వాళ్లసంసారం. అయినా వివాహబంధానికి కట్టుబడి సంసారం మాత్రం సాగిస్తారు. అటువంటి వాళ్ళల్లో పాతికేసి ఏళ్లు కలిసి సంసారం చేసినా ఒకరి నొకరు అర్థం చేసుకోకుండానే బిడ్డలతో మసుమలతో వార్ధక్యం వరకూ గడిపే కాలం వచ్చినా ఒకరి అభిప్రాయాలు ఒకరికి తెలియవు. ఆ విధంగా సంసారయాత్ర చెయ్యడంకంటే, నాకన్నివిధాల అర్హమైనదని నా మనస్సుకి నచ్చిన అమ్మాయినే పెళ్లాడదల్చుకొన్నా" అని తను చెప్పదల్చుకొన్నది ముగించాడు ఆ యువకుడు.

ఈ మాటలన్నీ విన్న సుందరమ్మ "మీ పేరెవరండీ? మీరేం చేస్తూంటారు?" అనడిగింది అప్రయత్నంగా.

"శంకర్రావు అంటారండి. బి. ఎ. కి ఇంకోపాట్టు పూర్తి చెయ్యడానికి చదువుతున్నా. అది పూర్తికాగానే ఏదైనా ఉద్యోగంలో ప్రవేశిస్తా."

"మీరు అన్నదమ్ములు అక్కచెల్లెళ్లు ఎందరు?"

"మా తల్లితండ్రులకి ఆడవాళ్లు నల్గురు, మగవాణ్ణి నేనొక్కణ్ణేనండి. మా నాన్నగారు గ్రామకరణం, మాకు పదెకరాల పల్లపుభూమి నాలుగెకరాల మెరక, ఓ యిల్లు వుంది."

"ఆడపిల్లలకి పెళ్లిళ్లు అయ్యాయా?" అనడిగాడు సుబ్బారావు.

"మా పెద్దక్కగారికి వివాహ మెప్పుడైందో నాకు తెలియదు గాని వితంతువై మా ఇంట్లో వుంది. మా రెండో అక్కగారి భర్త భార్యతో కలహించి మా అక్కని ఇద్దరు కూతుళ్లని మా ఇంట్లో వదలి దేశాంతరం వెళ్లిపోయాడు మిగతా వాళ్లిద్దరూ ఎవరి కాపురాలు వాళ్లు చేసుకొంటున్నారు."

సుబ్బారావు సుందరమ్మవారింట్లో వుండమని ఆహ్వానించడంతో శంకరం అంగీకరించాడు. సుబ్బారావు తన పరిస్థితినంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు శంకర్రావుకి

వారం రోజులు శంకరం సుబ్బారావు ఇంట్లోనే వున్నాడు. శర్వాణి అతని దృష్టిలో మొట్టమొదటనే ఆకర్షించింది. ఈ వారం రోజుల పరిచయంతోనూ ఆమె బాగా సన్నిహితురాలై పోయింది తను కోరిన స్వభావాలన్నీ ఆమెలో వున్నాయని గ్రహించుకొన్నాడు శంకరం.

శంకర్రావు వెళ్లిపోయేముందు సుబ్బారావుతోనూ, సుందరమ్మతోనూ "మీ అమ్మాయి శర్వాణిని నేను పెళ్లి చేసుకొంటా. ఇంటికి వెళ్లాక మా నాన్నగారిని పంపిస్తా. మా నాన్న పరమలోభి. నా పెళ్లికి కట్నంరూపంలో కొన్ని వేలు సంపాదించాలనే ప్రయత్నంలో వున్నాడు. వారు అడిగిన కట్నం మీరిస్తానని ఒప్పుకోండి. బట్టలకి, ఆడబిడ్డల లాంఛనాలకి కూడా సొమ్మే ఇస్తానని చెప్పండి. తర్వాత విషయాలు నేను చూచుకొంటా," అని చెప్పేసి వెళ్లిపోయాడు.

అనుకొన్నప్రకారం శంకర్రావుకి, శర్వాణికి వివాహం జరిగిపోయింది. ఆ సమయంలోనే కట్నంసొమ్ము తెమ్మన్నాడు కనకరాజు. కాని శంకర్రావు సలహాపై ప్రస్తుతంలో సుబ్బారావుచేత ప్రామిసరీ నోటు వ్రాయించుకు పెండ్లి, శుభకార్యం వగైరాలు పూర్తిచేసి అమ్మాయిని అత్తవారింటికి పంపించారు. అప్పటినుంచీ కనకరాజు కట్నం సొమ్ముకోసం పీడిస్తూనే వున్నాడు. చివరకి బెదిరింపు కూడా ప్రారంభించాడు. కూతురు అత్తవారింట్లో వుండే వ్యక్తులు అర్గురూ శర్వాణిని ఎందుకో ఒకందుకు దెప్పి పొడుస్తూనే వుంటారు." కాని ఎవరు ఎన్ని అన్నప్పటికీ శర్వాణిని భర్త మాత్రం ఎంతో ప్రేమగా ఆదరించి లాలిస్తూంటాడు."



జీవన్ ఫిలిమ్స్‌వారి "పతివ్రత" లో చంకన బిందెపెట్టి చిలుకలా చిరునవ్వు లొలికిస్తున్న ఈ సుందరి సావిత్రి అని వేరే చెప్పాలా ?

ఇదంతా ఆలోచిస్తూన్న సుబ్బారావుకి తన బావమరిది వైపుకి మళ్లింది దృష్టి. ఒకవేళ తనమీద పగపట్టి తన బావ మరిదే ఏదైనా కుట్రపన్ని నా కూతుర్ని పంపించేసి తన కూతుర్నిచ్చి పెళ్ళి చెయ్యాలనుకొన్నాడేమో !......

ఈ ఆలోచన వచ్చేసరికి సుబ్బారావుకి ముచ్చెమటలూ పోశాయి. అల్లాగే ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు సుబ్బారావు.

"ఎంతో మంచివాడు; మన అల్లుడు కూడా మారిపోయాడా ?" అంది సుందరమ్మ అప్పుడే వచ్చి.



"ఏమో ! చెప్పడు మాటలు చెడ్డవి. అయినా శంకరంమాత్రం ఒకరి మాటలు వినేవాడు మాత్రం కాదు." అన్నాడు కొంచెం ఆశగా సుబ్బారావు.

ఇల్లాగే సుబ్బారావు భార్య ఇంకా... ఇంకా మాట్లాడుకొంటూండగా నే గుమ్మంలో రిక్షా ఆగింది. శంకరం శర్వాణీ దిగివస్తోంటే తమ కళ్లని తామే నమ్మలేక, అది మంచికా—లేక...నిర్ధారణ చేసుకోలేని సుబ్బారావు దంపతులు అల్లాగె తెల్లబోయి చూస్తూ నిల్చున్నారు.

"అమ్మా ! మీ అల్లుడికి ఈ ఊళ్లోనే ఉద్యోగమైందమ్మా ! రేపే వెళ్లి జాయిన్ అవుతారు. అంది తల్లిని కావిలించుకొని శర్వాణి.

"మీ నాన్నగారి ఉత్తరం......" అంటూ జేబులో జాబును తీసి అల్లుని కిచ్చాడు సుబ్బారావు.

"మామగారూ! మీకేం భయంలేదు. మా నాన్నగారి దగ్గర ఇంకా కొన్ని వేలు పెట్లో వున్నాయి. మిమ్మల్ని బెదిరించి నట్లే......ఇప్పుడు మీరూ బెదిరించి వ్రాయండి. నా పేర పెళ్ళిలో వ్రాసిన ప్రాంశరీ నోటు ఇదుగో, దానిపై చెల్లు వ్రాసి ఇస్తున్నా. తీసుకోండి" అంటూ శంకరం ఆ నోటుపై తనకు సొమ్మంతా ముట్టినట్లు వ్రాసి, దానిపై వున్న స్టాంపును చింపివేసి సుబ్బారావు చేతి కిచ్చాడు. అప్పుడే రిజిష్టరీ నోటీసు కూడా వ్రాయించి పంపించారు సుబ్బారావు అల్లుడు కలిసి.

* * *

తన కొడుకు అత్తవారింటికి దూరంగా వేరే కాపురం పెట్టుకొన్నట్లు, తను ఇచ్చిన మూడు వందల రూపాయల తోసూ ఇంట్లోకి సరిపోయిన సామాగ్రి కొన్నట్లు ఉత్తరం వస్తుందని ఎదురు చూస్తూన్న కనకరాజుకి వియ్యంకుని నోటీసు అందింది. అందులో తన సొమ్ము ఎప్పుడు పంపిస్తున్నాడో వ్రాసేడేమోనని ఆతృతతో విప్పి చదువబోయాడు.

"మా వియ్యంకుడు కనకరాజు గారికి, ఇందు మూలముగా తెలియ జేయున దేమనగా; మనము మీ అబ్బాయికి వివాహకాలమందు అనుకొన్న ప్రకారం ఇస్తానన్న కట్నం సొమ్ము నేను పూర్తిగా ఇచ్చివేసినప్పటికి మీరు మా అమ్మాయికి బంగారు వస్తువుల నిమిత్తం ఆస్తానన్న సొమ్ము ఇంకా ఇవ్వలేదు. కాబట్టి ఈ నోటీసు అందిన తక్షణం మీరు చెప్పినప్రకారం ఇరవై అయిదు వందల రూపాయల వస్తువులు వెంటనే తిసుకురావలెను. లేనియెడల ఆ ఇరవై అయిదువందల రూపాయలు వడ్డీతో సహా కోర్టుద్వారా మీ వద్ద రాబట్టుకోగలవాడనని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు

సుబ్బారావు.

ఇది చదివిన కనకరాజు నిలువునా నీరైపోయి ఇదంతా తన కొడుకు చేయించిన కుతంత్రమని, దెబ్బకి దెబ్బ కొట్టించాడని అనుకోక తప్పలేదాయనకు.

★

